'కొంపదీసి అయిదయ్యే దాకా ఇక్కడే తిష్ట వెయ్యడుకదా?' అని మనసులో అనుకున్నా పైకి మాత్రం –

"మలకపేట వెళ్ళారండీ" – అన్నాను.

"ఇంట్లో ఏమి తోచక ఇలా వచ్చాను... ఏదైనా మంచి నవల వుంటే ఇస్తారేమో చదువుదామనీ –" టీపాయ్ మీదనున్న పుస్తకాలు తిరిగేస్తూ అన్నాడు చిదంబరం.

షెల్ఫులో వున్న ఓ అరడజను పుస్తకాల్ని ఆయన ముందు వేసి –

"చూడండి! ఇవే వున్నాయ్. మీకు కావలసింది తీసుకోండి.... మళ్ళీ రేపు తిరిగి ఇచ్చేయాలి సుమా.... ఇవన్నీ లైబ్రరీనుంచి తెప్పించుకుంది మా శ్యామల" – అన్నాను.

కాని ఆయన నా మాటలు వింటున్నట్టూ, ఆ పుస్తకాలు చూస్తున్నట్టూ అనిపించలేదు....

"ఏమిటీ? మీ అబ్బాయికి సైకిలు కొన్నారేమిటీ?... చాలా బాగుంది..." ఆ సైకిలు వైపు కళ్ళింత చేసుకుని చూస్తూ అన్నాడు.

"అవునండీ!"

"ఎంతకు కొన్నారేమిటి?" –

చెప్పాను.

"అబ్బా... ధర చాలా పెరిగిపోయిందడీ!... మా చిన్నతనంలో పాతిక రూపాయలుండేది... ఆ రోజుల్లోనే, ఇలాంటి సైకిలు కొనాలంటే కటకటలాడి పోయేవారు మన పెద్దాళ్ళు... ఇప్పుడిహ ఏం కొనగలం చెప్పండి?... ధర వింటేనే 'బీపీ' రైజయిపోతుంది నాలాంటి వాడికి" – సైకిలువైపే ఆపేక్షగా చూస్తూ అన్నాడు చిదంబరం...

నేను మాట్లాడలేదు... ఏమన్నా అనుకుంటాడేమోనని ఓ చిరునవ్వు మాత్రం విసిరాను...

"మీరేమీ అనుకోపోతే ఒక్కసారి ఈ సైకిలు నాకివ్వాలి!" – క్షణం తరువాత అన్నాడు చిదంబరం...

పక్కలో బాంబు పేలినట్లయింది...

"మీకా?... ఎందుకూ?"– అడిగాను.

"మరేంలేదండీ! మా కుర్రవెధవ సైకిలు కోసం మహ ముచ్చట పడిపోతున్నాడు... ఒక్కసారి తీసుకెళ్ళి, వాడ్ని ఎక్కించి అలా తిప్పి, ఇలా తెచ్చేస్తాను!... జస్ట్ టెన్ మినిట్స్...! అంతే" –

నేను ఇబ్బందిలో పడ్డాను..." సైకిలు ఇవ్వాలా వద్దా? ఇస్తే తిరిగి ఎప్పుడు తెస్తాడో?... ఇవ్వకపోతే కదిలేలా లేడు...! ఏం చేయాలి?"...

"మా బుజ్జిగాడు ఈ సైకిలు మీద అఖరికి ఈగని కూడా వాలనివ్వటం లేదు. తీరా వాడు తిరిగి వచ్చేసరికి సైకిలు లేకపోతే గొడవయి పోతుంది" – ఎలాగో చొరవచేసి చెప్పాను...

"అబ్బే! అలాంటి తబావతు రానివ్వను! ఎంతసేపండీ?... సరిగ్గా పదినిముషాలు...! పదినిముషాలయ్యేసరికి తిరిగి తెచ్చి యథాస్థానంలో పెట్టేస్తాను..." – బ్రతిమాలే స్వరంతో అన్నాడు చిదంబరం...

ఇంక తప్పేలా కనిపించలేదు...

"సరే... తీసుకోండి! పదినిముషాల్లో మాత్రం తిరిగి తెచ్చేయాలి!" – హెచ్చరికగా అన్నాను...

అంతే!...

ఒక్క ఎగురులో సైకిలు తీసుకుని వాళ్ళింటికి వెళ్ళిపోయాడు...

గోడ గడియారం మూడుగంటలు కొట్టింది...

పదినిముషాల్లో కాకపోయినా, మూడున్నరకు తెచ్చి ఇచ్చినా కనీసం ఓ అరగంట నేను తొక్కుకునేటందుకు గ్యారంటీగా వ్యవధి వుంటుంది....

అలా నిముషనిముషానికీ గడియారంలోకి చూస్తూ – అప్పుడప్పుడు వీధి గుమ్మంలోకి చూస్తూ – అలాగే కూర్చున్నాను ...

పదినిముషాలు... ఇరవై నిముషాలు... నలభై నిముషాలు...

అయినా చిదంబరం రాలేదు... నాకోమూల పిచ్చెక్కి పోతోంది! ఓవైపు నాలుగయి పోతోంది... విసుగొచ్చేస్తోంది... కోపమూ వస్తోంది...

ఇక వుండబట్టలేక – తలుపులు దగ్గరగావేసి చిదంబరం ఇంటికి విసవిసా అడుగులు వేస్తూ నడిచాను...

చిదంబరం ఇంటి తలుపులు మూసి వున్నాయి... లోపల నుంచి ఎలాంటి సందడీ వినిపించటం లేదు... అనుమానం వచ్చి – కిటికీ దగ్గరకు వెళ్ళి – ఓరగా మూసివున్న కిటికీ తలుపును తోసి లోపలకు చూశాను...

ఆశ్చర్యం!?...

ఆ గదిలో పిల్లలెవ్వరూ లేరు...

చిదంబరం మాత్రం 'ట్రింగ్ ట్రింగ్' మని బెల్ మోగించుకుంటూ ఆమూడు చక్రాల సైకిలు మీద –గది చుట్టూ రౌండ్లు కొట్టేస్తున్నాడు!!

(ఆంధ్రభూమి ఏప్రిల్ 1978)